సాక్షి
కామారెడ్డి
శుక్రవారం । 12 । జనవరి । 2024



పతంగులతో జాగ్రత్త

సంక్రాంతి రావడంతో పిల్లలు పతంగులు ఎగుర వేస్తున్నారు. ఈ సమయంలో జాగ్రత్తలు పాటించాల్సిన అవసరం ఉంది.

- 8లో ▸



చెట్ల కిందే చదువులు

ఎల్లారెడ్డి మండలం కల్యాణి ప్రాథమిక పాఠశాలలో తరగతి గదులు సరిపడా లేక విద్యార్థులు చెట్ల కింద చదువుకుంటున్నారు.

- 9లో ▸

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
31.9 /18.7

ఉదయం ఆహ్లాదకరంగా ఉంటుంది. ఈదురు గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. పొగమంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

ప్రొబెషనరీ ఐపీఎస్‌గా కాజల్



కామారెడ్డి క్రైం: ప్రొబెషనరీ ఐపీఎస్ అధికారిగా ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన కాజల్‌ను కామారెడ్డికి కేటాయించారు. గురువారం ఆమె కలెక్టర్ జితేష్ వి పాటిల్‌ను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. 75 ఆర్ ఆర్ 2022 బ్యాచ్‌కు చెందిన కాజల్ ఆరు నెలల పాటు ప్రొబెషనరీ అధికారిగా జిల్లాలో విధులు నిర్వహించనున్నారు.

సంస్కృతికి ప్రతీక సంక్రాంతి




కామారెడ్డి క్రైం: సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీక సంక్రాంతి పండుగ అని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. కామారెడ్డి కలెక్టరేట్ ఆవరణలో గురువారం టీఎన్జీవోస్ ఆధ్వర్యంలో మహిళా ఉద్యోగులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ముగ్గుల పోటీల్లో మహిళా ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పోటీల్లో పాల్గొనడం సంతోషకరమన్నారు. అనంతరం విజేతలకు కలెక్టర్ బహుమతులను ప్రదానం చేశారు. మొదటి బహుమతిని రాజ్యలక్ష్మి బృందం, ద్వితీయ బహుమతి సరళ బృందం, తృతీయ బహుమతి రోజారాణి బృందం ప్రతినిధులు అందుకున్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారిణి భాగ్యలక్ష్మి, జిల్లా షెడ్యూల్ కులాల సంక్షేమాధికారిణి రజిత, టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు నరాల వెంకటరెడ్డి, కార్యదర్శి సాయిలు, ఆర్గనైజింగ్ కార్యదర్శి సంతోష్ కుమార్, ప్రతినిధులు పాల్గొన్నారు.

ఘనంగా వడ్డె ఓబన్న జయంతి



కామారెడ్డి క్రైం: బ్రిటీష్ పాలకులను గడగడలాడించిన స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డె ఓబన్న అని కలెక్టర్ జితేష్ వి పాటిల్ కొనియాడారు. ఓబన్న జయంతిని గురువారం కలెక్టరేట్‌లో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఓబన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. ఉయ్యాలవాడ నరసింహారెడ్డి చేసిన సాయుధ పోరాటంలో వడ్డె ఓబన్న సైన్యాధ్యక్షుడిగా వీరోచిత పోరాటం చేసిన ధీరుడని అన్నారు. స్వాతంత్ర్యం కోసం పోరాడిన మహనీయుల దేశభక్తి, పోరాట పటిమలు భవిష్యత్తు తరాలకు తెలియాలనే ఉద్దేశంతో మహనీయుల జయంతులను ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తుందని పేర్కొన్నారు. ఓబన్న విగ్రహం ఏర్పాటుకు స్థలం కేటాయించాలని వడ్డెర సంఘం ప్రతినిధులు కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో బీసీ అభివృద్ధి అధికారి శ్రీనివాస్, వడ్డెర సంఘం ప్రధాన కార్యదర్శి సూర్య రాజం, ప్రతినిధులు శ్రీనివాస్, మధుసూదన్, కొమురయ్య, రమేశ్, బాలయ్య పాల్గొన్నారు.

'సాగర్' నీరు విడుదల



నిజాంసాగర్(జుక్కల్): యాసంగి పంటల సాగు అవసరాల కోసం గురువారం నిజాంసాగర్ ప్రాజెక్టు నుంచి ప్రధాన కాలువకు 1,700 క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేస్తున్నామని ప్రాజెక్టు ఏఈ శివప్రసాద్ తెలిపారు. ఇప్పటి వరకు రెండు విడతల్లో 2.99 టీఎంసీల నీటిని ఆయకట్టు పంటల అవసరాలకు విడుదల చేశామన్నారు. ప్రాజెక్టు నుంచి ప్రధాన కాలువకు విడుదల చేస్తున్న నీటిని ఆయకట్టు ప్రాంత రైతులు వృథా చేయకుండా వాడుకోవాలన్నారు.

ఆశల పల్లకీలో హస్తం నేతలు!





- నామినేటెడ్ పదవుల భర్తీపై సర్కారు ఫోకస్
- ఇప్పటికే గ్రంథాలయ సంస్థ పాలకవర్గాల రద్దు
- రద్దు ఖాతాలో మార్కెట్ కమిటీ పాలక వర్గాలు
- త్వరలో మొదలుకానున్న నియామక ప్రక్రియ

సాక్షి, కామారెడ్డి: దశాబ్దకాలంగా అధికారంలో లేక పదవులు పొందలేక, పనులు చేసుకోలేక అవస్థలు పడ్డ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఈ సారి రాష్ట్రంలో అధికారంలోకి రావడంతో ఎన్నో ఆశలు పెంచుకున్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కూడా అందుకు తగ్గట్టే అధికారం చేపట్టిన నెల రోజుల్లో నామినేటెడ్ పదవుల భర్తీపై దృష్టి సారించారు. ఇప్పటికే వివిధ సంస్థలు, కార్పొరేషన్ల పాలక వర్గాలను రద్దుచేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మార్కెట్ కమిటీల పాలక వర్గాలను కూడా రద్దు చేస్తున్నామని ఇటీవల సీఎం ప్రకటించారు. దీంతో కొత్తవారితో ఆయా పదవులను భర్తీ చేయడానికి మార్గం సుగమమైంది. పార్టీలో సీనియర్ నేతలను రాష్ట్ర స్థాయిలో కార్పొరేషన్ చైర్మన్లుగా, డైరెక్టర్లుగా నియమించే అవకాశాలున్నాయి. అలాగే ద్వితీయ శ్రేణి నేతలను జిల్లా, నియోజకవర్గ స్థాయిలోని వివిధ సంస్థల్లో నామినేట్ చేయనున్నారు. కాగా జిల్లాలో జిల్లా గ్రంథాలయ సంస్థ అలాగే పది వ్యవసాయ మార్కెట్ కమిటీలు ఉన్నాయి. గ్రంథాలయ సంస్థ చైర్మన్‌తో పాటు సభ్యులను నామినేట్ చేస్తారు. అలాగే మార్కెట్ కమిటీల్లో చైర్మన్, వైస్ చైర్మన్, డైరెక్టర్లను నియమిస్తారు. వీటితో పాటు జిల్లాలోని ఆయా దేవాలయాల అభివృద్ధి కమిటీలకు సంబంధించి పదవులను ప్రభుత్వం భర్తీ చేయనుంది. దీంతో కాంగ్రెస్ నేతల్లో ఆశలు పెరిగాయి. ఆయా పదవులపై కన్నేసిన నేతలు ఎమ్మెల్యేలు, నాయకులను కలిసి తమకు అవకాశం ఇప్పించాలని విన్నవించుకుంటున్నారు. ఎల్లారెడ్డి, జుక్కల్ నియోజక వర్గాల్లో కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు ఉన్నారు. నామినేటెడ్ పదవులు వారు ప్రతిపాదించిన వారినే నియమించే అవకాశం ఉంటుంది. కామారెడ్డి, బాన్సువాడ నియోజక వర్గాల్లో ప్రతిపక్ష పార్టీలకు చెందిన ఎమ్మెల్యేలున్నారు. నియోజకవర్గ కాంగ్రెస్ ముఖ్య నేతల సూచనల మేరకు నామినేటెడ్ పదవులు కట్టబెట్టనున్నారు. పార్లమెంటు ఎన్నికల్లోపు నామినేటెడ్ పదవులు పంచడం ద్వారా ఎన్నికల్లో మరింత కష్టపడతారని ఆ పార్టీ నాయకత్వం భావిస్తోంది. కొందరికి నామినేటెడ్ పదవులు ఇవ్వగా, మిగిలిన వారికి స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీచేసే అవకాశం కల్పించనున్నారు.

జిల్లాలో పది మార్కెట్ కమిటీలు

జిల్లాలో వ్యవసాయ మార్కెట్ కమిటీలు పది ఉన్నాయి. ఒక్కో దానిలో చైర్మన్, వైస్ చైర్మన్‌తో పాటు మరో పన్నెండు మంది డైరెక్టర్లను నియమించాల్సి ఉంటుంది. అంటే ఒక్కో మార్కెట్ కమిటీలో పద్నాలుగు మందికి అవకాశం దక్కుతుంది. కామారెడ్డి నియోజకవర్గంలో కామారెడ్డి, భిక్కనూరు మార్కెట్ కమిటీలు, ఎల్లారెడ్డి నియోజకవర్గంలో సదాశివ నగర్, గాంధారి, ఎల్లారెడ్డి మార్కెట్ కమిటీలు, బాన్సువాడ నియోజకవర్గంలో బాన్సువాడ, బీర్కూర్ మార్కెట్ కమిటీలు, జుక్కల్ నియోజకవర్గంలో పిట్లం, మద్నూర్, బిచ్కుంద మార్కెట్ కమిటీలున్నాయి. చైర్మన్, వైస్ చైర్మన్ పదవులతో పాటు డైరెక్టర్లను నియమిస్తారు. దీంతో జిల్లాలో వంద మందికిపైగా పదవులు పొందే అవకాశం ఉంటుంది. వీటితో పాటు ఆలయాలకు కమిటీలను నామినేట్ చేస్తారు. చైర్మన్‌తో పాటు డైరెక్టర్లు ఉంటారు.

ప్రయత్నాలు షురూ..

నామినేటెడ్ పదవుల భర్తీకి సంబంధించిన ప్రక్రియ త్వరలో మొదలుకానుంది. మార్కెట్ కమిటీలు, ఆలయ కమిటీల నియామకాలు తొలుత మొదలయ్యే అవకాశాలున్నాయి. దీంతో ఆశావహులు ప్రయత్నాలు షురూ చేశారు. కామారెడ్డి నియోజకవర్గంలో పార్టీలో ఏళ్ల తరబడిగా పనిచేస్తున్న చాలామంది సీనియర్లు తమకు అవకాశం దొరుకుతుందనే ఆశతో ఉన్నారు. ఎన్నికల్లో కష్టపడి పనిచేసిన వాళ్లంతా ఇప్పుడు తమకు పదవులు ఇవ్వాలని కోరుతున్నారు. కాంగ్రెస్ సీనియర్ నేత షబ్బీర్ అలీ ద్వారా పదవుల కోసం ప్రయత్నాలు మొదలుపెట్టారు. ఎల్లారెడ్డి నియోజకవర్గంలో స్థానిక ఎమ్మెల్యే మదన్‌మోహన్ అనుగ్రహం కోసం నేతలు ప్రయత్నిస్తున్నారు. బాన్సువాడలో మొన్నటి ఎన్నికల్లో పోటీచేసి ఓటమి చెందిన ఏనుగు రవీందర్‌రెడ్డి సహకారంతో పదవులు పొందాలని పలువురు నేతలు ప్రయత్నాలు చేస్తున్నారు. జుక్కల్‌లో ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు సహకారంతో నామినేటెడ్ పదవులు దక్కించుకోవాలని పలువురు చూస్తున్నారు. నామినేటెడ్ భర్తీ ప్రక్రియ చేపడితే పదవులు ఎవరికి వరిస్తాయో వేచిచూడాలి!

యథేచ్ఛగా కబ్జా..!

- మున్సిపల్ స్థలాల్లో నిర్మాణాలు
- ఎన్నికల ముందు కొన్ని సంఘాలకు స్థలాలు ఇచ్చారనే ఆరోపణలు
- పట్టించుకోని అధికారులు

కామారెడ్డి టౌన్: కామారెడ్డిలో బల్దియా స్థలాలు కబ్జాకు గురవుతున్నాయి. ప్రభుత్వ స్థలాల్లో కొందరు యథేచ్ఛగా నిర్మాణాలు చేపడుతున్నా.. వాటిని కాపాడాల్సిన బల్దియా పాలకులు, అధికారులు పట్టించుకోవడం లేదు. ఇటీవల మూడు చోట్ల మున్సిపల్ ఓపెన్ స్థలాల్లో భవన నిర్మాణ పనులు చేపట్టగా.. కాలనీవాసులు, కౌన్సిలర్లు ఫిర్యాదులు చేశారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు కొన్ని కుల సంఘాలకు అప్పటి అధికార పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులే ఆ స్థలాలను పంచారనే ఆరోపణలు వచ్చాయి. ఆ స్థలాల్లో నిర్మాణాలు సైతం చేశారు.

రాజకీయ ఒత్తిళ్లు

కామారెడ్డి పట్టణంలో సుమారు 250కిపైగా మున్సిపల్ ఓపెన్ స్థలాలున్నాయి. వీటిలో కొన్నింటిని గతంలో కుల సంఘాలు, ఆలయాలు, పార్కులకు కేటాయించారు. అయితే ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికలకు ముందు కొన్ని కుల సంఘాలకు మున్సిపల్ స్థలాలను పంచినట్లు సమాచారం. లింగాపూర్ పరిధిలోని స్వప్నలోక్‌లో 400 గజాల మున్సిపల్ స్థలంలో ఓ కుల సంఘం భవన నిర్మాణం చేపట్టడంతో 10 రోజుల క్రితం కాలనీవాసులు, కౌన్సిలర్ అడ్డుకుని కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. అలాగే అయ్యప్ప నగర్‌లో సైతం ఇలాంటి ఘటన చోటుచేసుకుంది. నవాబ్ వెంచర్‌లో వెయ్యి గజాల స్థలం, స్నేహపూరి కాలనీలో, భవానినగర్‌లో మున్సిపల్ స్థలాలు కబ్జాకు గురవుతున్నాయి. హౌసింగ్ బోర్డు కాలనీలో బల్దియా భూమిలో ప్రైవేట్ వ్యక్తులు తమ భూమి అని బోర్డు పాతారు. రాంమందిర్ ముందు 300 గజాల స్థలాన్ని ఆక్రమించే యత్నం చేయగా ఏడాది క్రితం సాక్షి కథనంతో వెనక్కి తగ్గారు. చెరువుకు వేళ్లే దారిలో రెండు చోట్ల స్థలాలు ఆక్రమణల్లో ఉన్నాయి. అశోక్‌నగర్ కాలనీలో రెండు ఓపెన్ స్థలాలను కబ్జా చేయడానికి యత్నిస్తున్నారు. కొన్ని బల్దియా స్థలాలు తమవేనంటూ ప్రైవేట్ వ్యక్తులు కోర్టులను ఆశ్రయిస్తున్నారు. అయితే కబ్జాదారులకు వత్తాసు పలుకుతూ కొందరు రాజకీయ నేతలు, ప్రజా ప్రతినిధులు అధికారులపై ఒత్తిడి తెస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. కొందరు అధికారులు డబ్బులు వసూలు చేసి అటు వైపు చూడటం లేరని విమర్శలు వినిపిస్తున్నాయి.

రక్షణ చర్యలు శూన్యం

మున్సిపల్ స్థలాల సంరక్షణకు అధికారులు చర్యలు చేపట్టడం లేదు. పదేళ్ల క్రితం అధికారులు ఏర్పాటు చేసిన బోర్డులను కబ్జాదారులు తొలగించారు. ఇప్పటికీ ఎక్కడా సర్కారు స్థలాలకు సంరక్షణ లేకుండా పోవడంతో కబ్జాదారులు వాటిపై కన్నేస్తున్నారు. కబ్జాదారులు కొంతకాలం ఆ స్థలాల్లో ఆక్రమణలో ఉంటూ నెమ్మదిగా కబ్జా చేస్తున్నారు. ఇదే తరహాలో వీక్లీ మార్కెట్‌లో సర్వే నంబర్ 6లో చోటుచేసుకుంది. రెవెన్యూ అధికారులు విచారణ చేసి సదరు స్థలం ప్రభుత్వానికి చెందినది అని ధ్రువీకరించారు. అయినా రూ.50 కోట్ల విలువ చేసే ఆ స్థలం ఇప్పుడు ఇసుక, ఇటుక వ్యాపారుల చేతుల్లో ఉంది. అధికారులు స్పందించి మున్సిపల్ స్థలాలను కాపాడాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

ఆక్రమిస్తే చర్యలు



స్వప్నలోక్, అయ్యప్ప నగర్‌లోని మున్సిపల్ స్థలాల్లో నిర్మాణాలు జరుగుతున్నాయని ఫిర్యాదు వచ్చాయి. ఆ నిర్మాణాలను నిలిపివేయించాం. ఎవరైనా బల్దియా స్థలాలను ఆక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. కౌన్సిల్‌లో చర్చించి కంచెలు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తాం.

– గిరిధర్, టీపీవో, కామారెడ్డి



స్వప్నలోక్‌లోని మున్సిపల్ స్థలంలో ఓ కులసంఘం భవనం నిర్మిస్తున్నారని చూపిస్తున్న స్థానికులు



కామారెడ్డి పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం

డ్యూటీకి డుమ్మా కొడుతూ..

- రిజిస్టర్‌లో సంతకాలు
- దేవునిపల్లి పీహెచ్‌సీలో మెడికల్ ఆఫీసర్ నిర్వాకం
- విచారణ జరిపిన డిప్యూటీ డీఎంహెచ్‌వో
- చర్యల కోసం ఉన్నతాధికారులకు నివేదిక



విచారణ జరుపుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో

కామారెడ్డి టౌన్: దేవునిపల్లి ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ విధులకు డుమ్మా కొడుతూ.. హాజరైనట్లుగా సంతకాలు చేయడం వివాదాస్పదమైంది. ఘటనపై విచారణ జరిపిన డిప్యూటీ డీఎంహెచ్‌వో చర్యల నిమిత్తం ఉన్నతాధికారులకు నివేదించారు. ఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. దేవునిపల్లి పీహెచ్‌సీలో మెడికల్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ జోహా ముజీబ్ ఈనెల 10, 11 తేదీల్లో విధులకు హాజరుకాలేదు. కానీ రిజిస్టర్‌లో హాజరైనట్లు సంతకాలు ఉన్నాయి. మెడికల్ ఆఫీసర్ సూచనతో సిబ్బందే ఆమె సంతకాన్ని పెట్టి ఉంటారని భావించిన కొందరు గురువారం ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో చంద్రశేఖర్ ఆస్పత్రికి చేరుకుని విచారణ చేపట్టారు. ఆయన ఆస్పత్రికి వచ్చేసరికి సిబ్బంది రిజిస్టర్‌లో పెట్టి ఉన్న సంతకాలను దిద్దారు. సీఎల్‌గా వేసినట్లు చూపించే ప్రయత్నం చేశారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో విచారణ జరపగా సదరు వైద్యురాలు ఆస్పత్రికి రాకపోయినా సంతకాలను సిబ్బందే చేసినట్లు తేలింది. ఈ సందర్భంగా డిప్యూటీ డీఎంహెచ్‌వో మాట్లాడుతూ మెడికల్ ఆఫీసర్ విధులకు డుమ్మా కొడుతూ రిజిస్టర్‌లో నకిలీ సంతకాలు పెట్టిస్తున్నట్లు నిర్ధారణ జరిగిందన్నారు. తదుపరి చర్యల నిమిత్తం ఉన్నతాధికారులకు నివేదించనున్నట్లు తెలిపారు. సదరు మెడికల్ ఆఫీసర్ హైదరాబాద్‌లోని ఓ ప్రముఖ ఆస్పత్రిలో పని చేస్తున్నట్లు తెలిసింది. చాలా రోజులుగా విధులకు సక్రమంగా హాజరుకావడంలేదని ఆరోపణలున్నాయి.

బీజేపీ అత్యధిక స్థానాల్లో గెలవడం ఖాయం

- జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి, ఎమ్మెల్యే కేవీఆర్



బాన్సువాడలో మాట్లాడుతున్న జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి, ఎమ్మెల్యే కేవీఆర్

బాన్సువాడ : వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో రాష్ట్రంలో అత్యధిక స్థానాలు బీజేపీ కైవసం చేసుకుంటుందని జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి, ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణారెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. బాన్సువాడ బీజేపీ కార్యాలయంలో గురువారం కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ మూడోసారి మళ్లీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. దేశంలో ప్రధాని మోదీ పేరుపై 30–40 శాతం ఓట్లు పడతాయని, జహీరాబాద్ పార్లమెంట్‌తో పాటు రాష్ట్రంలో అత్యధిక స్థానాల్లో బీజేపీ జెండా ఎగురవేస్తుందన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో కూడా బీజేపీ అధికారంలోకి వస్తుందనే నమ్మకం ఉండేనని, బాన్సువాడ, జుక్కల్‌లో కూడా బీజేపీ గెలుస్తుందని అనుకున్నామని పేర్కొన్నారు. కానీ కామారెడ్డిలో బీజేపీ గెలిచిందని, గతంలో కంటే ఈ సారి బాన్సువాడ, జుక్కల్‌లో బీజేపీకి ఓట్ల శాతం బాగా పెరిగిందన్నారు. కార్యకర్తలు ఇప్పటి నుంచే పార్లమెంట్ ఎన్నికల కోసం కష్టపడాలని, కేంద్రం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షురాలు అరుణతార, రాష్ట్ర ఉపాధ్యక్షులు యెండల లక్ష్మీనారాయణ, జహీరాబాద్ ఎంపీ నియోజకవర్గ కన్వీనర్ రవీందర్‌గౌడ్, ప్రభారి మహిపాల్‌రెడ్డి, నాయకులు భూపాల్‌రెడ్డి, చిదరి సాయిలు, డాకయ్య, కోనాల గంగారెడ్డి, దొరబాబు, శ్రీనివాస్ కార్లె, శంకర్‌గౌడ్ పాల్గొన్నారు.

'జహీరాబాద్' గెలుపునకు కృషిచేయాలి

కామారెడ్డి టౌన్: రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో జహీరాబాద్ స్థానంలో విజయం సాధించేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జి, ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన పార్లమెంట్ ప్రవాస యోజన నియోజకవర్గ స్థాయి నాయకుల సమావేశంలో మాట్లాడారు. పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. ప్రతిఒక్క నాయకుడు కలిసికట్టుగా పని చేయాలని సూచించారు. అసెంబ్లీ ఎన్నికల మాదిరిగా పార్లమెంట్ ఎన్నికల్లో కూడా కృషి చేయాలని కోరారు.

ముగిసిన కబడ్డీ టోర్నీ

- ఫైనల్స్‌లో విజేతగా నిలిచిన హర్యానా
- ద్వితీయ స్థానంలో కర్ణాటక
- తృతీయస్థానంతో సరిపెట్టుకున్న తెలంగాణ
- ఆద్యంతం ఉత్కంఠగా సాగిన అండర్–17 జాతీయ కబడ్డీ టోర్నీ



హర్యానా జట్టుకు ట్రోఫీని అందజేస్తున్న ఎమ్మెల్యే, కలెక్టర్ తదితరులు



ఫైనల్ మ్యాచ్‌ను వీక్షిస్తున్న ప్రేక్షకులు

కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ డిగ్రీ కళాశాలలో ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన అండర్–17 జాతీయ స్థాయి కబడ్డీ టోర్నమెంట్ గురువారం ముగిసింది. ఈనెల 7న ప్రారంభమైన టోర్నీ ఆద్యంతం ఉత్కంఠగా సాగింది. పోటీల్లో 28 రాష్ట్రాల నుంచి జట్లు పాల్గొన్నాయి. చివరి రోజు జరిగిన ఫైనల్స్‌లో హర్యానా విజేతగా నిలవగా, కర్ణాటక ద్వితీయ స్థానంలో నిలిచింది. తెలంగాణ జట్టు తృతీయ స్థానంతో సరిపెట్టుకుంది.

హోరాహోరీ పోరులో..

గురువారం జరిగిన ఫైనల్స్‌లో పోరులో కర్ణాటక – హర్యానా జట్లు హోరాహోరీగా తలపడ్డాయి. ఆద్యంతం వీక్షకుల్లో ఉత్కంఠ ఏర్పడింది. ఆట ప్రారంభం కాగానే హర్యానా జట్టు కాస్త పాయింట్లు ఎక్కువగానే సాధించిన ఆ తర్వాత కర్ణాటక జట్టు అంతే దీటుగా పోటీ ఇచ్చింది. ఫస్టాఫ్‌లో 30- 33 పాయింట్లతో ఉండగా ఆ తర్వాత సెకండాఫ్‌లో తీవ్ర ఉత్కంఠ రేపేలా ఇరు జట్లు ఆడాయి. ఈ క్రమంలో కర్ణాటక జట్టు పాయింట్లు సాధించుకుంటూ హర్యానా ఆటగాళ్లను ఆల్ అవుట్ చేసింది. దీంతో కర్ణాటక జట్టు విజయం సాధిస్తుందని ప్రేక్షకులు భావించారు. ఆ తర్వాత నిలదొక్కుంటూ వచ్చిన హర్యానా జట్టు బోనస్ పాయింట్లు సాధించుకుంటూ ముందుకుసాగింది. కోర్టులో ఇద్దరు మాత్రమే మిగిలి ఉన్నా.. చివరి క్షణంలో అంకుష్ అనే ఆటగాడు సూపర్ టాకిల్ చేసి జట్టులో ఉత్సాహం నింపాడు. అక్కడి నుంచి పాయింట్లు పెంచుకుంటూ 51- 49 పాయింట్లతో హర్యానా జట్టు విజయం సాధించింది. కర్ణాటక జట్టు ద్వితీయ స్థానానికి పరిమితమైంది.

తెలంగాణ – ఢిల్లీ మధ్య ఉత్కంఠ పోరు

టోర్నీలో మూడో స్థానం పోటీకోసం సెమీస్‌లో ఓడిన తెలంగాణ – ఢిల్లీ జట్లు గురువారం మొదటి మ్యాచ్‌లో పోటీ పడ్డాయి. పోటీల్లో మొదటి నుంచి తెలంగాణ పాయింట్లు సాధించుకుంటూ వచ్చింది. మధ్యలో ఢిల్లీ సైతం ఉత్కంఠ రేపేలా ఆడింది. కానీ చివరకు 41- 25 పాయింట్లతో తెలంగాణ జట్టు విజేతగా నిలిచి టోర్నీలో తృతీయ స్థానాన్ని దక్కించుకుంది.



ట్రోఫీ అందుకుంటున్న తృతీయస్థానంలో నిలిచిన తెలంగాణ జట్టు

క్రీడాకారులు ప్రపంచ స్థాయిలో రాణించాలి

క్రీడాకారులు ప్రపంచస్థాయిలో రాణించాలని కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి ఆకాంక్షించారు. కామారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో జరిగిన అండర్–17 జాతీయ స్థాయి కబడ్డీ టోర్నీ ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గెలుపు ఓటములను సమానంగా చూడాలని, ఓడిన వారు నిరాశ చెందవద్దన్నారు. గెలుపు కంటే ఓటమి నుంచే ఎన్నో నేర్చుకోవచ్చన్నారు. కలెక్టర్ జితేష్ వి పాటిల్ మాట్లాడుతూ జాతీయస్థాయి పోటీలను విజయవంతం చేసినందుకు ఎస్‌జీఎఫ్, టోర్నీ ఆర్గనైజర్లు, పీఈటీలను అభినందించారు. అనంతరం విజేతలకు ట్రోఫీలను అందజేశారు. కార్యక్రమంలో ఎస్పీ సింధూశర్మ, డీఈవో రాజు, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి నయాబ్ రసూల్, ఆర్గనైజింగ్ కార్యదర్శి దామోదర్‌రెడ్డి పాల్గొన్నారు.

క్లుప్తంగా

రాష్ట్ర స్థాయి వ్యాస రచన పోటీల్లో విద్యార్థిని ప్రతిభ

దోమకొండ: రాష్ట్ర స్థాయి వ్యాసరచన పోటీల్లో దోమకొండ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థిని తృతీయ స్థానంతో ప్రతిభ కనబర్చినట్లు కళాశాల ప్రిన్సిపల్ శివరాములు గురువారం తెలిపారు. పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న అక్షిత ఈనెల 8 నుంచి 10వ తేదీ వరకు జరిగిన పోటీల్లో తృతీయ స్థానం సాధించిందన్నారు. అంతకుముందు పాఠశాల స్థాయిలో మొదటి స్థానం సాధించి రీజినల్ స్థాయికి వెళ్లిందన్నారు. పాఠశాల సీనియర్ వైస్ ప్రిన్సిపల్ స్వర్ణలత, జూనియర్ వైస్ ప్రిన్సిపల్ మమత, అధ్యాపకులు విద్యార్థినిని అభినందించారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో జిల్లా జట్టు

కామారెడ్డి అర్బన్: ఈ నెల 11 నుంచి 14వ వరకు గజ్వేల్‌లో నిర్వహించే 49వ రాష్ట్రస్థాయి అండర్–20 బాలబాలికల కబడ్డీ పోటీల్లో పాల్గొనడానికి గురువారం కామారెడ్డి జిల్లా జట్టు వెళ్లింది. క్రీడాకారులకు స్థానిక మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ కుంబాల రవియాదవ్ దుస్తులను బహూకరించారు. రాష్ట్ర కబడ్డీ పోటీల్లో జిల్లా పేరు నిలపాలని ఆయన ఆకాంక్షించారు. కబడ్డీ అసోసియేషన్ జిల్లా ప్రతినిధులు రంగా వెంకటేశ్వర్‌గౌడ్, మధుసూదన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు యువకుల ఎంపిక

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): జప్తిజాన్కంపల్లి గ్రామానికి చెందిన సాయిబాబా, ప్రశాంత్ రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికయ్యారు. కామారెడ్డి జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 5న జిల్లాకేంద్రంలో నిర్వహించిన అండర్–20 బాలుర కబడ్డీ సెలక్షన్స్‌లో ఇద్దరూ ఉత్తమ ప్రతిభ కనబర్చారు. ఈ మేరకు నేటి నుంచి గజ్వేల్‌లో జరుగనున్న రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు అధికారులు వారిని ఎంపిక చేశారు. వారిని గ్రామసర్పంచ్ సాయిలుతోపాటు బొల్లారం హైస్కూల్ పీఈటీ నరేష్‌రెడ్డి, ఇతర గ్రామపెద్దలు అభినందించారు.

కళాశాలలో కబడ్డీ పోటీలు

లింగంపేట(ఎల్లారెడ్డి): స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని యువశక్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో లింగంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు గురువారం కబడ్డీ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా యువశక్తి ఫౌండేషన్ అధ్యక్షుడు మన్నె కృష్ణ మాట్లాడారు. క్రీడల వల్ల మానసిక ధైర్యం, స్నేహభావం పెంపొందుతుందన్నారు. యువశక్తి ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి చిలుక శ్రీనివాస్, కార్యదర్శి పురుషోత్తం పాల్గొన్నారు.

పతంగుల వేళ.. పిల్లలూ జాగ్రత్త

- చైనా మాంజాతో పొంచిఉన్న ప్రమాదం
- తల్లిదండ్రుల పర్యవేక్షణ తప్పనిసరి
- మాంజాతో పక్షులకూ ఇబ్బందులే..



నిజామాబాద్ రూరల్/రాజంపేట : నేటి నుంచి పాఠశాలలకు రాష్ట్ర ప్రభుత్వం సెలవులు ప్రకటించడంతో పిల్లల్లో ఎక్కడలేని ఆనందం కనిపిస్తుంది. చిన్నాపెద్దా తేడాలేకుండా పతంగులు ఎగరేసేందుకు ఆసక్తి కనబరుస్తుంటారు. కాని చైనామాంజా కారణంగా ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిసినప్పటికీ ఇష్టారాజ్యంగా మాంజా అమ్ముతున్నారు. ఆ మాంజాతో పతంగులు ఎగరేస్తే చిన్నారులతో పాటు పక్షులకు కూడా ప్రమాదం పొంచి ఉంది. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని పోస్టాఫీస్ వద్ద రోడ్డుకు ఇరువైపులా పతంగీల దుకాణాలు వెలిశాయి.

ఉమ్మడి జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో పతంగుల దుకాణాలు సందడిగా మారాయి. దుకాణాల్లో గాలిపటాలు, మాంజాలతో పాటు దారాలు, క్యాండిల్స్, ప్యారాషూట్, ఫ్యాన్సీ ఐటెంలు, చరఖా, త్రెడ్ చెరఖా, చిన్నపిల్ల ఫ్యాన్సీ ఐటెంలు విక్రయానికి సిద్ధం చేశారు.

అవగాహన కల్పించాలి..

చైనా మాంజా పిల్లలు ఎక్కడ పడితే అక్కడ పడేయడంతో పక్షులకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతాయి. వాటి కాళ్లకు చిక్కుకున్న చైనా మాంజా వదలకపోవడంతో అవి ప్రాణాలు కోల్పోతున్నాయి. వీటిపై తల్లిదండ్రులు చిన్నారులకు అవగాహన కల్పించాలి. ప్రమాదాల బారిన పడకుంటా ఎలా ఎగరేయాలనే విషయాలను స్పష్టంగా చెప్పాలి.

సాదా మాంజానే వాడాలి..

పతంగులు ఎగరేసేటప్పుటు చైనా మాంజాను కాకుండా సాదా మాంజానే వాడాలని నిపుణులు పేర్కొంటున్నారు. సాదా మాంజాతో పక్షులకు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు ఉండవంటున్నారు. మాంజాల ధరలతో పోలిస్తే చైనా మాంజాలు ఒక చర్క దాదాపు రూ. 300 నుంచి మొదలుకుని రూ.500 వరకు విక్రయిస్తున్నారు. సాధారణ మాంజాలు అందుబాటు ధరల్లోనే ఉన్నాయి.

విద్యుత్ తీగలతో ప్రమాదం

భవనాలు, పిట్టగోడలు, బాల్కానీలపై నిలబడి పతంగులు ఎగరేసేటప్పుటు జాగ్రత్తలు పాటించాలి. చిన్నచిన్న గల్లీలు, భారీ భవన సముదాయాలు, విద్యుత్ తీగలు, సెల్ఫోన్ టవర్ల సమీపంలో గాలిపటాలు ఎగురవేసే సాహసం చేయకూడదు. పతంగులు విద్యుత్ తీగలు, స్తంభాలు, చెట్లపై పడితే తీసుకునే ప్రయత్నం చేయద్దు. ఇలా తీసుకునే ప్రయత్నంలో ప్రమాదాలకు చిన్నారులు ఎక్కువగా గురవుతున్నారు. రోడ్ల వెంట గాలి పటాలు కోసం పరుగులు పెట్టనీయవద్దు. పైగా రహదారులపై వెళ్తున్న వారి మెడకు బిగుసుకుపోవడంతో గొంతు దగ్గర గాయాలవుతున్నాయి. డాబాలపై కాకుండా మైదానాలను ఎంపిక చేసుకోవాలి.

చైనా మాంజాలు వాడొద్దు



పిల్లలు చైనా మాంజాలకు ప్రాముఖ్యత నిస్తూ ప్రమాదాల బారిన పడిన ఘటనలు ఎన్నో ఉన్నాయి. వీటితో గొంతు కోసుకు పోయే ప్రమాదం ఉంది. చైనా మాంజాలకు స్వస్తిపలికి సాధారణ మాంజాలకు ఎక్కువ ప్రాముఖ్యత ఇవ్వాలి. వీటిపై తల్లిదండ్రులు పిల్లలకు అర్థమయ్యేరీతిలో చెప్పాలి.

– పోల వంశీ రెడ్డి, బర్దీపూర్

అమ్మితే చర్యలు



ప్రమాదకర మాంజాలు వాడినా, సరఫరా చేసినా, నిల్వ ఉంచినా వన్యప్రాణి సంరక్షణ చట్టం(1986) కింద జైలు శిక్ష లేదా రూ.లక్ష విధిస్తాము. పక్షులకు ప్రమాదం అని ప్రభుత్వం సింథటిక్ చైనా మాంజాలను నిషేధించింది. పండగను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలి.

– రమేశ్, ఎఫ్ఆర్‌వో, రాజంపేట

పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి



కామారెడ్డి క్రైం: నిజాంసాగర్‌లోని జవహర్ నవోదయ విద్యాలయంలో ఆరవ తరగతిలో ప్రవేశానికి ఈ నెల 20న నిర్వహించనున్న ప్రవేశ పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో పరీక్ష నిర్వహణ ఏర్పాట్లపై అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. జిల్లాలో 2,689 మంది బాలబాలికలు ప్రవేశ పరీక్ష రాయనున్నారని తెలిపారు. బాన్సువాడ, దోమకొండ, కామారెడ్డి, బిచ్కుంద, ఎల్లారెడ్డిలలో 14 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు పరీక్ష కొనసాగుతుందన్నారు. పరీక్షా కేంద్రాల్లో అన్ని వసతులు కల్పించాలన్నారు. సమావేశంలో జవహర్ నవోదయ విద్యాలయ ప్రిన్సిపాల్ సత్యవతి, డీఎస్పీ మదన్ లాల్, లీడ్ జిల్లా మేనేజర్ భార్గవ్ సుదీర్, డీఈవో రాజు, బీపీవో శ్రీనివాస్ రావు, కలెక్టరేట్ సూపరింటెండెంట్ సాయి భుజంగ రావు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ షాపింగ్ కాంప్లెక్స్ గదుల స్వాధీనం

మాచారెడ్డి: మండలంలోని గజ్యానాయక్ తండా చౌరస్తాలోని శ్రీ హనుమాన్ వేంకటేశ్వరాలయ ప్రాంగణంలో నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్ గదులను దేవాదాయ శాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. దాతలు ఇచ్చిన స్థలంలో బీఆర్ఎస్ నేతలు గదులు నిర్మించి ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారన్న ఫిర్యాదు మేరకు గురువారం దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ సుప్రియ ఆలయాన్ని సందర్శించి మాట్లాడారు. దాతలు ఇచ్చిన విరాళాలతో గదులు నిర్మించినా దేవాదాయ శాఖకు స్వాధీనం చేయకపోవడం విడ్డూరమన్నారు. ఖాళీగా ఉన్న గదులకు తాళాలు వేశారు. ప్రస్తుతం దుకాణాలు నడుపుతున్న గదులను 15 రోజుల్లోగా ఖాళీ చేయాలని ఆదేశించారు. ఆమె వెంట దేవాదాయ శాఖ సిబ్బంది రవీందర్, ప్రభు, శ్రీధర్, లక్ష్మణ్, సర్పంచ్ హంజీ నాయక్, ఆలయ కమిటీ చైర్మన్ శ్రీకాంత్, మాజీ చైర్మన్లు లక్ష్మారెడ్డి, శ్రీనివాస్ చారి ఉన్నారు.



మాట్లాడుతున్న అసిస్టెంట్ కమిషనర్ సుప్రియ

నాణ్యమైన భోజనం పెట్టాలి

బీబీపేట: విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కూర రఘోత్తమ్ రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 317 జీవోలో భాగంగా నష్టపోయిన ఉపాధ్యాయులకు న్యాయం చేస్తామని పేర్కొన్నారు. అనంతరం పాఠశాల ఉపాధ్యాయ బృందం ఆయనను సన్మానించింది. వాచ్ఎం రామేశ్వర్‌రెడ్డి, కల్వరాల్ జీహెచ్ఎం విష్ణువర్ధన్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలి

భిక్కనూరు: యువత లక్ష్యాన్ని నిర్దేశించుకొని ఆ దిశగా పయనించాలని తెలంగాణ యూనివర్సిటీ సౌత్ క్యాంపస్ ప్రిన్సిపాల్ సుధాకర్‌గౌడ్ అన్నారు. సౌత్‌క్యాంపస్‌లో సోషల్ వర్క్ విభాగం ఆధ్వర్యంలో గురువారం ఏర్పాటు చేసిన వివేకానంద జయంతి కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. స్వామి వివేకానందను యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. అనంతరం వృద్ధులు ఆశ్రమాల్లో పడుతున్న కష్టాలపై వేసిన నాటికలు పలువురిని కంటతడి పెట్టించాయి. వైస్ ప్రిన్సిపాల్ రాజేశ్వరి, సోషల్ వర్క్ బీవోఎస్ వీరభద్రం, ప్రొఫెసర్లు హరిత, మోహన్‌బాబు, ప్రతిజ్ఞ, అంజయ్య, యాలాద్రి, సునీత, తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలు అంకితభావంతో పనిచేయాలి



మాట్లాడుతున్న కామారెడ్డి ఎమ్మెల్యే

- కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణా రెడ్డి

గాంధారి(ఎల్లారెడ్డి): రాబోయే లోకసభ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి విజయం కోసం కార్యకర్తలు అంకితభావంతో సైనికుల్లా పనిచేయాలని కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి అన్నారు. గురువారం ఆయన మండలంలో పర్యటించారు. బీజేపీ కార్యాలయంలో లోకసభ ఎన్నికల సన్నాహక సమావేశంలో మాట్లాడారు. పార్టీ అభ్యర్థి విజయం కోసం తీసుకోవాల్సిన చర్యల గురించి పార్టీ నాయకులు, కార్యకర్తలకు వివరించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు అరుణతార, బాణాల లక్ష్మారెడ్డి, మురళీధర్ గౌడ్, సుభాష్ రెడ్డి, పలు మండలాల అధ్యక్షులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

యజ్ఞం నిర్వహించడం అభినందనీయం

సదాశివనగర్(ఎల్లారెడ్డి): లింగంపల్లి శ్రీకృష్ణ మందిరం ఆధ్వర్యంలో విశ్వశాంతి గీతా జ్ఞాన యజ్ఞం నిర్వహించడం అభినందనీయమని కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లివెంకట రమణారెడ్డి, ఎంపీ బీబీ పాటిల్ అన్నారు. మండలంలోని లింగంపల్లి శ్రీ కృష్ణ మందిరంలో గురువారం నిర్వహించిన విశ్వశాంతి గీతా యజ్ఞం ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరై వారు మాట్లాడారు. ఇలాంటి కార్యక్రమం నిర్వహించడం దేశానికే గర్వకారణమన్నారు. సర్పంచ్ సాయిలు, ఉప సర్పంచ్ దామోదర్ రావు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

పెర్కిట్(ఆర్మూర్): రాష్ట్రస్థాయి జూనియర్ బాలికల హ్యాండ్‌బాల్ పోటీలకు ఉమ్మడి నిజామాబాద్ జిల్లా నుంచి క్రీడాకారులను ఎంపిక చేసినట్లు జిల్లా ప్రధాన కార్యదర్శి పింజ సురేందర్, కోశాధికారి గటడి రాజేశ్ గురువారం తెలిపారు. ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లిలో నిర్వహించిన ఎంపిక పోటీల్లో ఉమ్మడి నిజామాబాద్ జిల్లా నుంచి రాష్ట్ర స్థాయి పోటీలకు క్రీడాకారులను ఎంపిక చేశారు. ఆదిలాబాద్ జిల్లా ఆసిఫాబాద్‌లో ఈ నెల 15,16,17వ తేదీల్లో నిర్వహించే రాష్ట్ర స్థాయి జూనియర్ బాలికల హ్యాండ్ బాల్ పోటీల్లో ఎంపికైన క్రీడాకారులు పాల్గొంటారని అసోసియేషన్ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు గంగామోహన్ చక్రు, హాకీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సదమస్తుల రమణ, పీఈటీలు సునీత, మాధురి, రజిత, సురేశ్, శ్రీనివాస్, అనూష, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కుస్తీ పోటీలు



నిజాంసాగర్(జుక్కల్): ఎలామస పండుగ ఉత్సవాల్లో భాగంగా జుక్కల్ మండలం పెద్దగుల్లా గ్రామంలో మల్లయోధుల కుస్తీ పోటీలు గురువారం హోరాహోరీగా కొనసాగాయి. సర్పంచ్ వినోద్ ఆధ్వర్యంలో మల్లయోధులకు కుస్తీ పోటీలు నిర్వహించారు. విజేతలకు వెండి కడియాన్ని బహుమతిగా అందజేశారు. కార్యక్రమంలో గుల్లా సర్పంచ్ విఠల్ పటేల్, కల్లాలి సర్పంచ్ రమేష్‌దేశాయ్, సాయిలు, వినోద్, గంగాధర్‌నాయక్, చంద్రకాంత్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాలల్లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): జిల్లాలోని ఆదర్శ పాఠశాలల్లో 2024–25విద్యాసంవత్సరానికి సంబంధించి ప్రవేశం కోసం ప్రభుత్వం నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. జిల్లాలోని నాగిరెడ్డిపేట, ఎల్లారెడ్డి, నిజాంసాగర్, బాన్సువాడ, మద్నూర్, సదాశివనగర్ మండలాల్లో ఆదర్శ పాఠశాలలున్నాయి. వీటిల్లో ఆరోతరగతిలో ప్రవేశంతోపాటు 7–10వ తరగతి వరకు ఖాళీగా ఉన్న సీట్ల భర్తీ కోసం నోటిఫికేషన్ వెలువడింది. పాఠశాలల్లో ప్రవేశం కోసం నేటి నుంచి ఈ నెల 22 వరకు ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవాలి. ఏప్రిల్ 1 నుంచి హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవాల్సి ఉంటుంది. ఏప్రిల్ 7న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఆరో తరగతిలో చేరేవారికి, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు 7–10వ తరగతుల్లో చేరేవారికి ప్రవేశపరీక్ష నిర్వహిస్తారు. ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకునేందుకు ఓసీలు రూ.200, ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ విద్యార్థులు రూ.125 చొప్పున ఫీజు చెల్లించాల్సి ఉంటుంది.

జాతీయ యువజన ఉత్సవాలకు తరలిన సౌత్‌క్యాంపస్ విద్యార్థులు

భిక్కనూరు: మహారాష్ట్రలో ఈనెల 12 నుంచి 16వరకు జరిగే జాతీయ స్థాయి యువజనోత్సవాలకు తెలంగాణ యూనివర్సిటీ సౌత్ క్యాంపస్ ఎన్ఎస్ఎస్ ఐదవ యూనిట్ వాలంటీర్లు శివకుమార్, పవన్‌లు ఎంపికయ్యారు. ఈమేరకు గురువారం సౌత్‌క్యాంపస్ నుంచి నాసిక్‌కు బయలుదేరి వెళ్లారు. వారిని సౌత్ క్యాంపస్‌లో జరిగిన కార్యక్రమంలో అభినందించారు. ప్రిన్సిపాల్ సుధాకర్‌గౌడ్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారి అంజయ్య, తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

కాకుల వేటగాళ్ల పట్టివేత



వర్ని: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో కాకులను వేటాడుతున్న ఇద్దరిని పట్టుకున్నట్లు అటవీశాఖ డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ బాబు గురువారం తెలిపారు. తినుబండారాల్లో విషపూరిత కెమికల్స్ కలిపి కాకులకు ఎరగావేసి పట్టుకుంటున్నట్లు స్థానికుల ద్వారా సమాచారం అందడంతో వారిని పట్టుకున్నట్లు పేర్కొన్నారు. వీరిపై వన్యప్రాణుల సంరక్షణ చట్టం కింద కేసు నమోదు చేసినట్లు చెప్పారు. కాకులను హోటళ్లు, దాబాల్లో విక్రయిస్తున్నారా లేదా ఇతర మందుల తయారీకి వాడుతున్నారా అన్న విషయాలపై విచారణ చేపడుతున్నట్లు తెలిపారు. ఆయన వెంట మోస్రా సెక్షన్ ఆఫీసర్ ప్రభాకర్, అటవీ సిబ్బంది ఉన్నారు.

పేకాట స్థావరంపై దాడి

బోధన్‌టౌన్: పట్టణంలోని రంగరిగల్లీలో పేకాటస్థావరంపై దాడి చేసినట్లు సీఐ వీరయ్య గురువారం తెలిపారు. పక్కా సమాచారం మేరకు బుధవారం రాత్రి పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందడంతో దాడి చేసి 9 మందిని అరెస్టు చేసి ఆర్డీవో రాజాగౌడ్ ఎదుట బైండోవర్ చేసినట్లు పేర్కొన్నారు. దాడిలో వారి నుంచి రూ. 38 వేల నగదును స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

వాడిలో కూలీ అదృశ్యం



వేల్పూర్: వాడి గ్రామంలో మేస్త్రీ వద్ద కూలీపని చేసే మునుకుంట్ల మధు అనే వ్యక్తి గత డిసెంబర్ నెల 29న అదృశ్యమైనట్లు ఎస్సై వినయ్‌కుమార్ గురువారం తెలిపారు. సూర్యాపేట జిల్లా కోదాడకు చెందిన మధు బతుకు దెరువు నిమిత్తం పచ్చలనడ్కుడలో సత్యం అనే మేస్త్రీ వద్ద కూలీ పని చేయడానికి డిసెంబర్‌లో వచ్చాడు. ఐదు రోజులు పనిచేసిన తర్వాత అదృశ్యమైనట్లు చెప్పారు. మధు భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

బస్వాపూర్‌లో పేకాట స్థావరంపై దాడి

రుద్రూర్: కోటగిరి మండలం బస్వాపూర్ శివారులో పేకాటస్థావరంపై దాడి ముగ్గురిని అరెస్టు చేసినట్లు ఎస్సై సందీప్ గురువారం తెలిపారు. వీరి నుంచి రూ.2500 నగదు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

మాంజా దారాలు అమ్మితే చర్యలు



కామారెడ్డి అర్బన్: గాలిపటాలు ఎగురవేయడానికి అతి ప్రమాదకరమైన నైలాన్, మాంజా దారం విక్రయిస్తే తీవ్ర చర్యలుంటాయని జిల్లా ఫారెస్ట్ అధికారులు గాలిపటాలు అమ్మే దుకాణదారులను హెచ్చరించారు. అనంతరం పలువురు దుకాణదారులకు నోటీసులు అందజేశారు. మనుషులతోపాటు పక్షులు, జంతువులకు హానిచేసే మాంజా దారాల తయారీ, విక్రయాలను ప్రభుత్వం నిషేధించిందని, అతిక్రమించిన వారిపై కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. అధికారులు ఫారుక్, అమరంజని, సురేశ్, పద్మారావు, దీపిక తదితరులు ఉన్నారు.

ఇటుక లారీ, ఆటో ఢీ



ప్రమాద స్థలంలో ఆటో, లారీ





చికిత్స పొందుతున్న సుశీల్‌దేవ్, గుడ్డు పటేల్

- నలుగురికి తీవ్రగాయాలు, ఒకరి పరిస్థితి విషమం

మోపాల్: మండలంలోని కంజర్ శివారులో గురువారం ఉదయం ఇటుక లారీ, ఆటో ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఆటో డ్రైవర్‌తోపాటు లారీలో ఉన్న ముగ్గురికి తీవ్ర గాయలు కాగా వీరలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సిర్‌పూర్ గ్రామానికి చెందిన శేఖర్ తన ఆటోలో కంజర్ శివారులో ఉన్న శార్వాణీ పాఠశాలకు నలుగురు విద్యార్థులను తీసుకొచ్చాడు. వారిని పాఠశాలలో వదిలేసి రోడ్డుపైకి వస్తుండగా అదేసమయంలో మోపాల్ చౌరస్తా నుంచి కంజర్ వైపు ఇటుక లారీ అతివేగంగా వెళ్తోంది. రోడ్డుపైకి వస్తున్న ఆటోను లారీ డ్రైవర్ కృష్ణ గమనించలేదు. దీంతో అదే వేగంతో ఆటోను ఢీకొనడంతో లారీ బోల్తా పడింది. ప్రమాదంలో ఆటో డ్రైవర్ శేఖర్, నర్సింగ్‌పల్లిచెందిన లారీ డ్రైవర్ కృష్ణతోపాటు ఒరిస్సా నుంచి వచ్చిన కూలీలు సుశీల్‌దేవ్ మహానంద్, గుడ్డు పటేల్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వీరిలో గుడ్డు పటేల్ పరిస్థితి విషమంగా ఉంది. ప్రమాదానికి లారీ డ్రైవర్ కృష్ణ అతివేగం, అజాగ్రత్తతో నడపడమే కారణమని పోలీసులు భావిస్తున్నారు. విషయం తెలుసుకున్న ఎస్‌హెచ్‌వో గంగాధర్ ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. క్షతగాత్రులను 108లో జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. శేఖర్ తండ్రి సత్యం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో పేర్కొన్నారు. కాగా ప్రమాదం జరగడంతో రోడ్డుపై ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. పోలీసులు అక్కడే ఉండి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు.

తప్పిన పెను ప్రమాదం..

సిర్‌పూర్ నుంచి శేఖర్ ఆటోలో నలుగురు విద్యార్థులను తీసుకుని పాఠశాలలో వదిలేయడానికి బయలుదేరారు. ఆటోను లారీ ఢీకొన్న విషయం తెలియగానే విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళనకు గురయ్యారు. విద్యార్థులను పాఠశాలలో వదిలేసిన తర్వాత ప్రమాదం చోటుచేసుకుందని నిర్ధారించుకుని ఊపిరి పీల్చుకున్నారు. ఆటో డ్రైవర్ శేఖర్ ఒక్కరే గాయపడటంతో పెను ప్రమాదం తప్పిందని వారు పేర్కొంటున్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో పలువురి మృతి



చంద్రకళ మృతదేహం

ఆర్మూర్‌టౌన్: రోడ్డు దాటుతున్న ఓ మహిళను వేగంగా వచ్చిన ఓ కారు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందిన ఘటన మండలంలోని చేపూర్ శివారులో గురువారం చోటు చేసుకుంది. చేపూర్ గ్రామానికి చెందిన సురంపల్లి చంద్రకళ(33) పెర్కిట్‌లో పని ముగించుకొని ఆటోలో చేపూర్ శివారులో దిగింది. రోడ్డు దాటే క్రమంలో హైదరాబాద్ నుంచి నిర్మల్ వైపు వెళ్తున్న కారు వేగంగా చంద్రకళను ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందింది. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతురాలి అన్న సుదర్శన్‌గౌడ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో సురేశ్‌బాబు తెలిపారు.

బస్సు ఢీకొని యువకుడి మృతి

డిచ్‌పల్లి: మండల కేంద్రంలోని రైల్వేస్టేషన్ సమీపంలో ఆర్టీసీ అద్దె బస్సు ఢీకొనడంతో పత్తిరి సతీశ్ (18) అనే యువకుడు అక్కడికక్కడే మృతి చెందినట్లు ఎస్సై మహేశ్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. ఘన్‌పూర్ గ్రామానికి చెందిన సతీశ్ గురువారం సాయంత్రం రైల్వేస్టేషన్ సమీపంలో రోడ్డును దాటుతుండగా అదే సమయంలో డిచ్‌పల్లి నుంచి నిజామాబాద్ వైపు అతివేగంగా వెళుతున్న ఆర్టీసీ పల్లెవెలుగు బస్సు ఢీకొన్నది. ఈ ఘటనలో బస్సు టైర్లు అతని పైనుంచి వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాదం జరిగిన వెంటనే డ్రైవర్ నాశెట్టి రవి బస్సును ఆపకుండా వేగంగా ముందుకు పోనిచ్చాడు. గమనించిన స్థానికులు బైక్‌లపై వెంబడించి కేఎస్ఆర్ గార్డెన్స్ వద్ద బస్సును అడ్డుకున్నారు. దీంతో డ్రైవర్ బస్సు దిగి పోలీసులకు లొంగిపోయాడు. మృతుడి నానమ్మ పత్తిరి భూమవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

లారీ ఢీకొని యువకుడు..

భిక్కనూరు: మండంలంలోని బస్వాపూర్ శివారులో జాతీయ రహదారిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతిచెందినట్లు ఎస్సై సాయికుమార్ తెలిపారు. బస్వాపూర్ గ్రామానికి చెందిన తలారి ఎల్లేశ్(29) మండల కేంద్రంలో పనులు ముగించుకొని స్వగ్రామానికి బైక్‌పై వస్తుండగా జాతీయ రహదారిపై వెనుకనుంచి వస్తున్న లారీ ఢీకొన్నది. ఈ ఘటనలో ఎల్లేశ్ అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

బంధువుల అంత్యక్రియలకు వెళ్లి ఒకరు..



సురేశ్ మృతదేహం

జక్రాన్‌పల్లి: మండలంలోని మునిపల్లి గ్రామానికి చెందిన గుడ్ల సురేశ్ (49) బంధువుల అంత్యక్రియలకు వెళ్లి వస్తుండగా మృత్యువాత పడ్డాడు. ఎస్సై తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం.. మునిపల్లికి చెందిన సురేశ్ ఆర్మూర్‌లోని ఎస్‌బీ కాలనీలో నివాసం ఉంటున్నాడు. కాగా మునిపల్లిలో సురేశ్ బంధువులు అనారోగ్యంతో మృతిచెందారు. అంత్యక్రియల కోసం స్కూటీపై మునిపల్లికి వచ్చి ఆర్మూర్‌కు తిరిగి వెళ్తున్నాడు. ఈ క్రమంలో జాతీయ రహదారిపై స్కూటీ అదుపు తప్పి కిందపడిపోయాడు. తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి మేనల్లుడు నవీన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

మొరం టిప్పర్ల పట్టివేత



రుద్రూర్: కోటగిరి శివారులో అనుమతి లేకుండా మొరం తరలిస్తున్న రెండు టిప్పర్లను పట్టుకున్నట్లు ఎస్సై సందీప్ తెలిపారు. పక్కా సమాచారం మేరకు బుధవారం రాత్రి మొరం తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో దాడి చేసి టిప్పర్లను పట్టుకొని పీఎస్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. ఎవరైనా ప్రభుత్వ అనుమతి లేకుండా మొరం, ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఉప్పల్‌వాయిలో వృద్ధుడి ఆత్మహత్య

రామారెడ్డి: ఉప్పల్‌వాయి గ్రామానికి చెందిన ఓ వృద్ధుడు ఇంటి గొడవలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై సుధాకర్ గురువారం తెలిపారు. గ్రామానికి చెందిన కొత్తోళ్ల భీమయ్య(60) వ్యవసాయ పనులు చేస్తూ జీవిస్తున్నాడు. గత కొన్ని రోజులుగా భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. దీంతో భార్య పుట్టింటికి వెళ్లింది. దీంతో గురువారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.